# అరణ్య రోదన

ఆ అమ్మాయి పేరు ప్రేమవతి. ఆమె ఒక మాంటిస్సోరీ స్కూలుకి ప్రిన్సిపాల్‌గా వుండేది. బి. యిడి. చెయ్యటానికి అల్వార్ కాలేజీలో అడ్మిషన్ లభించింది. కొత్త ప్రదేశానికి ఒంటరిగా వెళ్ళాలంటే ఆమె భయపడింది. పిన్ని కొడుకు ప్రకాశ్ ఆమెకు తోడుగా వెళ్ళడానికి అంగీకరించాడు.

ప్రేమవతి ప్రకాశ్‌తో అల్వార్‌కి బయల్దేరింది. 1978 జూన్ వర్షాలుగో తేదీన మధుర చేరుకున్నారు. అక్కణ్ణించి భరత్‌పూర్‌కి రైల్లో వచ్చారు. భరత్‌పూర్ నుంచి బస్సులో అల్వార్ వెళ్ళవలసివుంది. ఇద్దరూ బస్‌స్టాండు చేరుకున్నారు. బస్సు బయల్దేరటానికి మరో రెండు గంటలు టైముంది. భరత్‌పూర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులో "గిరిరాజు" అనే అతను బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతను ప్రకాశ్‌కి చాలా దగ్గర స్నేహితుడు. ప్రకాశ్ గిరిరాజు కోసం ఆఫీసుకు వెళ్ళి వాకబు చేశాడు. అతను కనిపించాడు. ఇద్దరు స్నేహితులూ పరమానందంతో ఒకరినొకరు కౌగిలించుకున్నారు. ప్రకాశ్ ప్రేమవతిని పరిచయం చేస్తూ "ఈమె మా పెద్దమ్మ కూతురు. అల్వార్ బి. యిడి. కాలేజీలో చేర్పించడానికి తీసుకువెళ్తున్నాను!" అని చెప్పాడు.

గిరిరాజు "ఇంతరాత్రి పూట వెళ్లి అల్వర్‌లో ఏం చేస్తారు?" అని, ఆరాత్రి వారిని తన అతిథులుగా వుండమని కోరాడు. అందుకు వారు అంగీకరించారు. గిరిరాజు ఒంటరిగా వుంటున్నాడు. సామాను అతని గదిలో పెట్టి, ముగ్గురూ భరత్‌పూర్ వూరు చూడటానికి బయల్దే రారు. వాళ్ళు బజార్లో తిరుగుతున్నప్పుడు, ఇద్దరుకుర్రవాళ్ళు స్కూటరు మీద వాళ్ళని అనుసరించడం ప్రేమవతి గమనించింది. అంద మైన ఆడపిల్లలు బయటికి వస్తే ఇలాంటి సంఘటనలు సహజమే గనుక ఆమె ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వలేదు. వాళ్ళు ఒక హోటల్లో భోజనం చేసి బయటికి వచ్చారు. స్కూటరు ఆపుకుని దూరంగా వున్న కుర్ర వాళ్ళను ప్రేమవతి గమనించింది. అయినా ఆ విషయం ప్రకాశ్‌కి చెప్పలేదు.

ముగ్గురూ గిరిరాజు ఇంటిదగ్గరకు వచ్చారు. అతను ఇంటి తలుపు తాళం పూర్తిగా తీశాడో లేదో, స్కూటరు వచ్చి వాకిలి ముందు ఆగింది. ఇద్దరు యువకులూ స్కూటరు దిగారు. లోపలికి వెళ్ళబోతున్న వారిని అటకాయిస్తూ "ఆగండి! ఈ పిట్టను ఎక్కణ్ణుంచి లేపుకొచ్చారు?" అంటూ గర్జించాడు ఒకడు. క్షణకాలం ముగ్గురూ కొయ్యబారి నుంచు న్నారు.

"లేపుకు రావడం ఏమిటి? ఈమె నా చెల్లెలు. అయినా మీరెవరు అడగడానికి" అన్నాడు ప్రకాశ్ పూర్తిగా ఆశ్చర్యంనుంచి బయటపడ కుండానే.

రెండో యువకుడు మొదటి యువకుణ్ణి చూపిస్తూ, "ఇతను ఎవరనుకున్నావు? ఇనస్పెక్టర్ సాబ్!" అని అన్నాడు. కాని గిరిరాజుకు ప్రకాశ్‌కు అతని మాటల మీద నమ్మకం కలగలేదు. ప్రేమవతి సాయం కాలం నుంచి తమను వెంబడిస్తున్న యువకులు వాళ్ళేనని గుర్తించింది.

"మీరెవరైతే మాకేమిటి? మేము ఏం తప్పు చేశామని భయ పడాలి? ఈమె నా సోదరి'' అన్నాడు ప్రకాశ్.

మాట పూర్తి కాకుండానే మొదటి యువకుడు ప్రకాశ్‌ని ఈడ్చి చెంప దెబ్బ కొట్టాడు.

"సాలా! పదరా! స్టేషనుకి పద! నీపని చెబుతాను!" అంటూ గిరిరాజును కూడా కొట్టాడు. అనుకోకుండా జరిగిన ఆక్రమణ వలన ముగ్గురూ స్థాణువులా నిలబడిపోయారు. ఒక్క క్షణం గిరిరాజుకు కూడా ప్రకాశ్ మీద అనుమానం కలిగింది. ప్రకాశ్‌ను ప్రేమవతిని మార్చి మార్చి చూశాడు. ప్రేమవతి ఒక ప్రక్కగా పణుకుతూ నిల్చుంది. ఈ లోపల ఆ ఇద్దరిలో ఒకడు జేబులోంచి రివాల్వరు బయటికి తీశాడు. ప్రేమవతిని స్కూటరుమీద కూర్చోమన్నాడు. ఆమె అందుకు అంగీక రించలేదు. నిల్చున్న చోటు నుంచి కదలలేదు. రెండో యువకుడు రోడ్డుమీద వెళుతున్న రిక్షాను పిల్చాడు. రివాల్వరు చూపిస్తూ, ప్రేమ వతిని, ప్రకాశ్‌నీ రిక్షాలో కూర్చోమన్నాడు.

''మీ సంగతేదో పోలీసు స్టేషన్లోనే కనుక్కుంటాం పదండి!'' అన్నాడు. ప్రేమవతి, ప్రకాశ్ యాంత్రికంగా రిక్షాలో కూర్చున్నారు. ఆదే రిక్షాలో ఆ రిక్షాపిల్చిన యువకుడు కూడా ఎక్కి కూర్చున్నాడు. వెళ్తూ వెళ్తూ రివాల్వరు చూపించిన యువకుడు ''జాగ్రత్త ఇలాంటి గొడ వల్లో తలదూర్చకు!'' గిరిరాజుతో అని స్కూటర్ స్టార్ట్ చేశాడు.

రిక్షా స్కూటరు వెనకే పోనీయ్. దర్వాజా వైపుకి వేగంగా వెళ్ళ సాగింది. కొంత దూరం పోయి ఒక యింటి ముందు ఆగింది. ముగ్గురూ రిక్షా దిగి లోపలికి వెళ్ళారు. స్కూటరు మీద వచ్చిన యువకుడు రిక్షా కిరాయి ఇచ్చి లోపలికి వెళ్ళాడు. ఆ ఇంట్లో అద్దెకు వుంటున్న అతన్ని బయటకు వెళ్ళమని బెదిరించారు.

''ఇప్పుడు చెప్పు! ఈ అందాల రామచిలుక ఎవరో! నీ ప్రియురాలేనా?" అన్నాడు ఒకడు. ''కాదు! కాదు! ఈ అమ్మాయి మా పెద్దమ్మ కూతురు. నా చెల్లెలు!'' లబ లబలాడాడు ప్రకాశ్. రెండో యువకుడు పక్కనే వున్న కర్ర అందుకొని ప్రకాశ్‌ని బాదిపారేడు. అయినా అతను ''ఆ పిల్ల నా సోదరి'' అని చెప్తూనే వున్నాడు. ఈ లోపల రెండో యువకుడు ప్రేమవతిని బలవంతంగా లోపలి గదిలోకి లాక్కెళ్ళాడు. ప్రకాశ్ ''బాత్‌రూంకి వెళ్ళాలని అన్నాడు" తనను కొడుతున్న యువకునితో. పక్కనే వున్న బాత్‌రూమ్‌లోకి వెళ్ళటానికి అనుమతించాడు. అంతలోనే అతనికి ప్రేమవతిని తన స్నేహితుడు లోపలికి లాక్కెళ్ళటం గుర్తొచ్చి, అతను లోపలికి వెళ్ళాడు. అదను చూసి ప్రకాశ్ తప్పించుకుని పారిపోయాడు.

ప్రేమవతి కేకలు విని, ఇరుగు పొరుగు వాళ్ళు కొందరు ఆ ఇంటి ముందు పోగయ్యారు. అందులో ఎవరికీ లోపలికి వెళ్ళేధైర్యం లేదు. అంతలో ఆ యువకులిద్దరూ ప్రేమవతిని బయటకు లాక్కువచ్చి స్కూటరుమీద కూర్చోపెట్టుకుని జనం మధ్యనుంచే వెళ్ళిపోయారు.

ఆ అమ్మాయి "రక్షించండి! రక్షించండి!" అంటూ కేకలు వేసింది. ఎవరికీ ముందుకు వచ్చే సాహసం లేకపోయింది.

కారణం ఆ యువకుల గురించి అక్కడివారందరికి తెలిసి వుండటమే!

స్కూటర్ నెంబరు యు. యస్. ఏ. 2100 రంగు తెలుపు. అది వేగంగా భరత్‌పూర్ దాటి మట్టి రోడ్డు మీద కొంత దూరం పోంది. ప్రేమవతి ఆ ఇద్దరు యువకుల మధ్య కూర్చుంది. ఒక నిర్జీవ ప్రదేశంలో స్కూటరాపి ప్రేమవతిని క్రిందికి లాగారు. ఆమె తనమీద

జరుగుతున్న దౌర్జన్యాన్ని సాధ్యమైనంతవరకు ప్రతిఘటించింది. గాజులు చిట్లిపోయాయి. శరీరం మీది గాయాల నుంచి అక్కడక్కడా రక్తం వస్తోంది. చివరకు ఆమె ఆ దుర్మార్గులకు లొంగిపోక తప్ప లేదు. ఆమె శీలంతోపాటు ఒంటిమీద వున్న నగలు కూడా దోచుకున్నారు.

ప్రకాశ్ అక్కణ్ణించి పారిపోయి పోలీసులకు రిపోర్టు చేశాడు. సినిమాల్లోలాగ అంతా జరిగిపోయాక పోలీసులు ఆ ఇంటికి వచ్చారు. ఇరుగు పొరుగు తాముచూసిన దృశ్యాన్ని వర్ణించిచెప్పారు. ఇన్స్పెక్టర్‌కు ఆ ఇంట్లో ఒక బొమ్మ రివాల్వర్ దొరికింది. దాంతోనే ఆ యువకులు ప్రకాశ్‌ని, ప్రేమవతిని భయపెట్టినట్టు అర్థంచేసుకున్నాడు. ఇరుగుపొరుగు ద్వారా ఆ కుర్రవాళ్ళిద్దరూ చాలా దుర్మార్గులనీ, వాళ్లని చూసి అంతా భయపడతారని పోలీసులు తెలుసుకున్నారు.

''కిరణ్'' అనే ఒక నర్సు ఈ యువకులతో సన్నిహితంగా వుంటుందన్న సంగతి కూడా తెలిసింది. కిరణ్ దగ్గరికి వెళ్ళారు. అందులో ఒకడి పేరు "ప్రేమ్‌ప్రసాద్" అని, రెండోవాడి పేరు ''దినేశ్ అనీ తెలిసింది. వాళ్ళు తన దగ్గరకు రాగానే పోలీసులకు తెలియజెయ్యటానికి కూడా ఒప్పుకుంది. ప్రకాశ్ ప్రేమవతిని గురించి దిగులు పడిపోయాడు. "ఆ దుర్మార్గులామెను ఏంచేశారో? చంపేశారేమో? పెద్దమ్మకు ఏం సమాధానంచెప్పాలి?" అనేక ప్రశ్నలతో అతను సతమతమవుతున్నాడు.

రాత్రి దాదాపు రెండు గంటలకు ప్రేమవతి వెతుక్కుంటూ పోలీస్ స్టేషన్‌కి చేరింది. తనకు జరిగిన అన్యాయాన్ని గురించి పోలీస్ స్టేషన్‌లో వివరించింది. ఆ ఇద్దరు దుర్మార్గులూ ప్రేమవతిని తీసుకొచ్చి జిల్లా లైబ్రరీ ముందు వదిలేశారు. "పోలీసు రిపోర్టు ఇచ్చినట్లయితే ప్రాణాలు తీస్తాం!'' అని భయపెట్టారు.

డాక్టరు బి. కె. శర్మ, డాక్టరు రాజకుమారి ఆమెను పరీక్షించి, ఆమె మీద బలత్కారం జరిగినట్లు ధృవీకరించారు.

ప్రేమవతిని వదిలాక ప్రేమ్, దినేష్ ఒక స్నేహితుడు ఇంటికి వెళ్ళారు. అతని పేరు శ్యాం ప్రసాద్. అతను ఒక కట్టెల అడ్తికి యజమాని. శ్యాం వాళ్ళిద్దరికి ''మీకోసం పోలీసులు గాలిస్తున్నారు. వెంటనే ఇక్కడ్నుంచి వెళ్లిపోండ"ని సలహా ఇచ్చాడు. స్కూటర్ అక్కడే వదిలి ఆ యువకులిద్దరూ మధురకు బయలుదేరారు. వారితో శ్యాం కూడా బయలుదేరాడు. మధుర వెళ్ళాక ప్రేమ్ తను ఢిల్లీ వెళ్తానని చెప్పాడు. అతని పెద్దనాన్న ఢిల్లీలో వున్నాడు. అక్కడ కొంతకాలం గడవడానికి అనుకూలంగావుంటే వుత్తరంరాస్తాననీ, అప్పుడు దినేశ్‌కూడా రావచ్చునని చెప్పాడు. అందుకు దినేశ్ అంగీకరించాడు. ప్రేమ్ ఢిల్లీకి బయలుదేరాడు.

ఫిబ్రవరి ఇరవైఆరున శ్యాంతో సహా దినేశ్ కూడా ఢిల్లీచేరాడు. అక్కడ కెళ్ళగానే ప్రేమ్ ఢిల్లీనుంచి అల్వర్ వెళ్ళి పోయాడని తెల్సింది. అల్వర్‌లో ప్రేమ్ అత్తగారిల్లుంది. దినేశ్ అక్క కూడా అల్వర్‌లోనే వుంది. వెంటనే దినేశ్ శ్యాంతో కలిసి అల్వర్ చేరుకున్నాడు. వాళ్ళిద్దరూ ఒక స్నేహితుడి ఇంట్లో దిగారు. ముగ్గురూ ముందు తీసుకోవలసిన జాగ్రత్తల్ని గురించి ఆలోచనలు జరిపారు. అప్పటికే ఆ సంఘటన గురించి పత్రికలన్నీ రాశాయి. అందరి నోళ్లలో అదే చర్చ. వెంటనే అల్వర్‌నుంచి కూడా పారిపోవడానికి నిర్ణయించుకున్నారు. డబ్బుకావాలి. రాధాకృష్ణ అనే యువకుడ్ని భరత్‌పూర్‌లోవున్న కిరణ్ దగ్గరకు పంపించడానికి నిర్ణయించుకున్నారు.

ప్రేమ్ కిరణ్‌కు చాలా డబ్బు ఇచ్చి వున్నాడు. వెంటనే రాధాకృష్ణ భరత్‌పూర్ వచ్చాడు. కిరణ్ దగ్గరకు వచ్చి డబ్బు అడిగాడు.

"అలాగే ఇస్తాను, ఇప్పుడు నా దగ్గిర క్యాష్‌లేదు. నా స్నేహితురాల్ని అడిగి తెస్తాను. అంతవరకూ మీరు విశ్రాంతి తీసుకోండి'' అని చెప్పి బయిటికి వెళ్లింది. తిన్నగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి రిపోర్టు ఇచ్చింది. రాధాకృష్ణను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాధాకృష్ణ దెబ్బలు తినకుండానే నిజం చెప్పేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో అల్వార్ బయలుదేరాడు. రాధాకృష్ణను కూడా తీసుకెళ్ళారు. రాధాకృష్ణ ఎవరికీ సంబంధంలేని ఒక ఇంటిని చూపించి పోలీసుల్ని మోసగించాడు. ఆ ఇంటిని సోదా చేస్తున్న సమయంలో ప్రేమ్ దినేష్ ఇద్దరూ ప్రేమ్ అత్తగారింట్లో వున్నారు. ఊళ్ళోకి పోలీసులు వచ్చారని తెలియగానే పారిపోయారు. ఢిల్లీ వెళ్తున్న ఒక లారీ ఎక్కారు. ఢిల్లీలో వారికి ఒక మిత్రుడు వున్నాడు. ఆ రాత్రికి అతని ఇంట్లో వుండి అతని దగ్గర మూడొందల రూపాయలు అప్పు తీసుకుని కలకత్తా వెళ్ళారు. వాళ్ళు కలకత్తాలో వున్నట్టు పోలీసులకు ఆచూకి తెలిసింది. ప్రేమ్ బీహార్‌కు బయలుదేశాడు. అదేరోజు ఒక పరిచితుడి ద్వారా అతను పోలీసులకు దొరికిపోయాడు. దినేష్ పారిపోయాడు. కాని మూడు నెలలు తిరక్కుండానే అల్వార్‌లో అతన్ని కూడా అరెస్ట్ చేశారు.

కోర్టులో కేసు చాలా కాలం నడిచింది. ప్రేమవతి కోర్టులో అనేక అవమానకరమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసి వచ్చింది. ఆమెకు బెదిరింపు ఉత్తరాలు వచ్చేవి. అయినా ప్రేమవతి పట్టుదలతో భరత్‌పూర్ కోర్టుకు హాజరవుతూ వచ్చింది.

చివరకు దోషులిద్దరికి పదేసి సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరిగింది. ఇప్పుడు వాళ్ళు జయపూర్ సెంట్రల్ జైలులో వున్నారు. హైకోర్టుకు అపీలు చేసుకున్నారు.

ప్రేమవతి కూడా పట్టుదలతోనే వున్నది.